సాక్షి
పల్నాడు
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



హనుమాన్ చాలీసా పారాయణం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్య వైశ్య అన్నదాన సత్రంలో చాతుర్మాస దీక్ష ధ్యాన తరగతులు సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం నిర్వహించారు.



దిగువకు 36,950 క్యూసెక్కులు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 33,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36,950 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 6636 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1760 క్యూసెక్కులు వదిలారు.

ఉచిత దోపిడీ

కొండెక్కిన ఇసుక ధర

- జిల్లాలో ఖాళీగా దర్శనమిస్తున్న ఇసుక స్టాక్ పాయింట్లు
- నెల్లూరు జిల్లాలో ఇసుక బుకింగ్ చేసుకోవాలంటున్న సిబ్బంది
- రూ.2 వేలకు కూడా దొరకని టన్ను ఇసుక
- దళారుల వద్ద కొందామంటే రెట్టింపు ధర
- నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పస్తులుంటున్న కార్మికులు
- సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

జిల్లాలో ఇసుకకు కొరత ఏర్పడింది. స్టాక్ పాయింట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి ఇసుకను కూడా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంత ధర చెల్లించి కొనుగోలు చేయలేక భవన యజమానులు పనులు నిలిపివేశారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు ఉంటున్నారు. మేము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామని బాకా ఊదిన కూటమి ప్రభుత్వం సమస్యను పట్టించుకోవడం లేదు.

సత్తెనపల్లి: ఇసుక బంగారమైంది. సామాన్యులకు దొరకడం గగనమైంది. పేరుకే 'ఉచిత ఇసుక'. కావాలంటే స్టాక్ పాయింట్లు .. ర్యాంపులలో దొరకదు.. దొడ్డిదారిన కొందామన్నా ధరకు ఆకాశమే హద్దు. రెండు గదుల ఇల్లు కట్టుకునే సామాన్యుల నుంచి అపార్ట్‌మెంట్లు నిర్మించే భవన నిర్మాణ యజమానుల వరకూ ... రోడ్డు పక్కన డ్రెయిన్లు నిర్మించే చిన్న కాంట్రాక్టర్ల నుంచి భారీ నిర్మాణాలు చేపట్టే పెద్ద కాంట్రాక్టర్ల వరకూ ఇసుక కోసం పడిగాపులు పడుతున్నారు. జిల్లాలో ఇసుక కొరతతో ఎటు నిర్మాణ రంగం అటు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు రోజుల తరబడి నిలిచిపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం జూన్ 12న కొలువు దీరింది. అచ్చంపేట, అమరావతి మండలాల్లోని ర్యాంపుల నుంచి ఇసుక సేకరించి ఉంటే ప్రస్తుతం ఇంత ఇసుక కొరత ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చేది కాదు. కానీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడగా జూన్ 6 నుంచి 4, 5 రోజులపాటు జిల్లాలోని ఇసుక పాయింట్ల నుంచి దొడ్డిదారిన ఇసుక అమ్మకాలకు టీడీపీ కీలక ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. స్టాక్ పాయింట్లలో ఇసుక నెల రోజుల్లో అయిపోతే కొరత పట్టిపీడిస్తుందనే ఆలోచన జిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యేలకు లేకపోవడం గమనార్హం.



పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇసుక ట్రాక్టర్లు

బ్లాక్‌లో టన్ను రూ.2 వేలు పైమాటే...

కూటమి ప్రభుత్వంలో అందరికీ ఉచిత ఇసుకను ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు డబ్బులు కట్టమని చెబుతున్నారు. డబ్బు కట్టి బుక్ చేసుకుందామన్నా జిల్లాలో ఎక్కడా ఇసుక దొరకడం లేదు. గ్రామీణ ప్రాంతాలకే కాదు కనీసం మండల కేంద్రానికి, పట్టణాలకు కూడా ఇసుక అందుబాటులో లేదు. జిల్లాలో ఎక్కడా ఇసుక లేదని నెల్లూరులో అందుబాటులో ఉందని బుక్ చేయమంటారా అంటూ సచివాలయం సిబ్బంది అడగడంతో అక్కడి నుంచి తెచ్చుకోవడానికి బాడుగ భరించలేని పరిస్థితి నెలకొంది. బుకింగ్ చేసుకున్న వారికి కూడా నాణ్యమైన ఇసుక దొరకడం లేదు. వచ్చే రాళ్లు, మట్టి తీసుకోవాల్సిందేనని ఒత్తిడి ఉంటుందని, ఇప్పుడు అది కూడా లేని పరిస్థితి నెలకొంది. ఎప్పుడైనా అడపాదడపా వచ్చే ఇసుకను కొందామంటే బ్లాక్‌లో ధర ఆకాశాన్ని అంటుతుంది. ఏకంగా టన్ను రూ.2 వేలు పైనే పలుకుతోంది.



పట్టణంలో పనులు కోసం ఎదురు చూస్తున్న కార్మికులు



ఇసుక లేక భీమవరంలో నిలిచిపోయిన ఇంటి నిర్మాణం

ఎక్కడి పనులు అక్కడే...

గత ప్రభుత్వంలో ఇసుక టన్ను రూ.800కి అన్‌లోడు చేసేవారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటే ఇసుక లోడ్ చేసి పంపేవారు. దీంతో సామాన్యుడికి ఇసుక సులభంగా..తక్కువ ధరకు లభించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడికి ఇసుక అందని ద్రాక్షలా మారింది. ఇంటి నిర్మాణాలకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిచ్చింది. ఇనుము, సిమెంటు, కడ్డీలు, తలుపులు, ఇతర ఇంటి నిర్మాణ సామాగ్రి అందించింది. ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వందల కొద్దీ నిర్మాణాలు మొండి గోడలను తల పిస్తున్నాయి. ఇసుక అందుబాటులో లేక నిర్మాణరంగం కుదేలైంది. గతంలో కంటే అధిక ధరకు ఇసుక అప్పుడప్పుడు సరఫరా చేస్తున్నారు. అయినా ఎక్కడ ఇసుక దొరకకపోవడంతో పనులు లేక కార్మికులు పస్తులుంటుంటే, గృహనిర్మాణ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇల్లు గడవడం కష్టంగా ఉంది



నా భర్త కాళ్ల నొప్పులతో పని చేయలేడు. నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నేను పనిచేస్తే తప్ప కుటుంబం గడవదు. ఇసుక లేక ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో మాకు పనులు దొరకడం లేదు. రోజూ క్యారేజీలకు అన్నం కట్టుకొని వచ్చి పనులు లేక తిరిగి వెళుతున్నాం. ఇల్లు గడవడం కష్టంగా ఉంది.

–మాతంగి నాగమణి, కార్మికురాలు, మాదల

పనులు లేక అవస్థలు



నా భార్యకు నెమ్ము. అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటుంది. మాకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నేను పని చేస్తేనే కుటుంబం గడిచేది. ఇసుక కొరతతో కూలి పనులు లేక అవస్థలు పడుతున్నాం. వారం వారం కూలికి వెళుతూ సరుకులు, ఇంటి కావాల్సినవి తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు పనులు లేక అవస్థలు పడుతున్నాం.

–కుంచాల సుబ్బారావు, కార్మికుడు, భీమవరం

అప్పు కూడా దొరకడం లేదు



నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నా భార్య కూలి పనులకు వెళుతుంది. నేను నిర్మాణ పనులకు వెళుతుంటా. ఇసుక లేక వారానికి ఒకసారి కూడా పని దొరకడం లేదు. పనులు లేక అప్పు పుట్టక అవస్థలు తప్పడం లేదు. జీవనం మరింత కష్టంగా మారింది.

– వేముల ఏడుకొండలు, కార్మికుడు, గండ్లూరు

ఇసుక లేక పని దొరకడం లేదు



నాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇసుక లేకుండా ఏ నిర్మాణం చేయాలన్నా చాలా కష్టం. ఇసుక లేని కారణంగా వారం రోజుల నుంచి పని దొరకడం లేదు. దొంగతనంగా ఇసుక వస్తున్నా కట్టడి చేయడం లేదు. కుటుంబం గడవక వేరే దిక్కు లేక ఇబ్బంది పడుతున్నా. పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులకు పైసా కూడా లేక పనుల కోసం ఎదురు చూపులు తప్పటం లేదు.

–బొడ్డు ప్రసాద్, కార్మికుడు, సత్తెనపల్లి

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జెడ్పీ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జెడ్పీ అతిథి గృహంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జ్యోతిబసును డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

32 మంది సచివాలయ మహిళా పోలీసులు బదిలీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 32 మంది మహిళా పోలీసులను వారు కోరుకున్న ప్రదేశాలకు బదిలీ చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. వీరందరూ సంబంధిత ఎంపీడీవోలకు రిపోర్టు చేసి తమ విధుల్లో చేరాలని ఎస్పీ ఆదేశించారు.

పొంగిన చంద్రవంక వాగు

మాచర్ల–జమ్మలమడక రహదారిలో నిలిచిన రాకపోకలు



మాచర్ల: మాచర్ల పట్టణం, రూరల్ ప్రాంతాలలో సోమవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు చంద్రవంక పొంగి పొర్లింది. మాచర్ల నుంచి జమ్మలమడక, తుమ్మకోటకు వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఇన్‌చార్జి కమిషనర్ నాగేశ్వరరావు, డి నాగభూషణం, అర్బన్ సీఐ ప్రభాకరరావులు చంద్రవంక వాగును పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘం వారు బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను జేసీబీ ద్వారా తొలగించారు. ప్రజలెవరూ వాగు వైపు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పలు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,200, ఎడమకాలువకు 3,849, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,217, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరదకాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 44,666 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అంతే నీటిని ఇక్కడ నుంచి విడుదల చేస్తున్నారు.

చేనేత స్టాల్స్ సందర్శన



మంగళగిరి: మంగళగిరి ఆటోనగర్‌లో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాల్స్‌ను చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత, కమిషనర్ రేఖారాణిలు మంగళవారం సందర్శించారు. కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత మాట్లాడుతూ చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడం కోసం ఏపీఐఐసీలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించి పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వనజ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఓ యువకుడు మృతి
- 15 గంటలు కాలువలో గాలించగా మృతదేహం లభ్యం
- మరో యువకుడు మృత్యుంజయుడు
- విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు
- వడ్డవల్లిలో అలుముకున్న విషాదం

సత్తెనపల్లి: వినాయకుడి నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. ఇరువురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు సమీపంలోని బ్రిడ్జి వద్ద గల గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా మత సామరస్యాన్ని చాటి చెప్పేలా సత్తెనపల్లి మండలం వడ్డవల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో వినాయక విగ్రహాన్ని ఈనెల 7న ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకువచ్చి మండపంలో ఏర్పాటు చేశారు. 17 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. 17వ రోజైన సోమవారం రాత్రి వైభోపేతంగా వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. రాత్రంతా వినాయక ఊరేగింపు కొనసాగి తెల్లవారుజామున 4.30 గంటల సమయానికి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువలో వినాయక నిమజ్జనం చేశారు.

ఆ సమయంలో 10 మంది వరకు కాలువలోకి దిగగా షేక్ మహ మ్మద్ రఫీ (18), గండేపల్లి తిరుపతిరావులు గల్లంతయ్యారు. ఇరువురు యువకులు గల్లంతయ్యారన్న సంగతి తెలుసుకున్న వినాయక నిమజ్జన కమిటీతోపాటు మరికొందరు రాత్రి సమయంలోనే గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. గల్లంతైన వారిలో గండేపల్లి తిరుపతిరావును కాపాడగలిగారు. మృత్యుంజయుడుగా తిరుపతిరావు బయటపడటంతో వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మరో యువకుడు షేక్ మహమ్మద్ రఫీ కోసం ఎంత గాలించినప్పటికీ ఆనవాళ్లు కనిపించలేదు. పోలీసులకు, వడవల్లి పెద్దలకు సమాచారం అందించడంతో పెద్దఎత్తున కాలువ వద్దకు చేరుకున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ప్రత్యేకంగా 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి గల్లంతైన షేక్ మహమ్మద్ రఫీ కోసం వెతుకులాడారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో రఫీ మృతదేహం కాలువలో లభ్యమైంది. 15 గంటలపాటు శ్రమించి షేక్ మహమ్మద్ రఫీ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, వడ్డవల్లి వాసులు, వినాయక మండప కమిటీ సభ్యులు వచ్చి ఆవేదన వ్యక్తం చేయడంతో రోదనలు మిన్నంటాయి.



వినాయక ఊరేగింపులో మృతుడు షేక్ మహమ్మద్ రఫీ



రఫీ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వంశోద్ధారకుడును కోల్పోయి ఆవేదన

పట్టణంలోని వడ్డవల్లికి చెందిన షేక్ పీరు బుడే, షేక్ జాకీరా దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పీరుబుడే తాపీ పనులకు వెళ్లి జీవనం వెళ్లదీస్తున్నారు. 10వ తరగతి వరకు చదువుకున్న కుమారుడు షేక్ మొహమ్మద్ రఫీ రెండేళ్ల కిందట చదువు మానేశాడు. తండ్రితోపాటు తాపీ పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికొచ్చిన వంశోద్ధారకుడు మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. రఫీ మృతి చెందడంతో పట్టణంలోని వడ్డవల్లిలో విషాదం అలముకుంది.









విజయవాడలోని భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గోపిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు మంగళవారం నిత్యావసరాలు, దుప్పట్లు, చీరెలు పంపిణీ చేస్తున్న నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిత్రంలో నాయకులు వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు – గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

- రూ.10లక్షల విలువైన నరుకులు అందజేసిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- రెండు వాహనాల్లో విజయవాడకు తరలింపు
- వాహనాలకు పచ్చజెండా ఊపిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి
- నాయకులు, కార్యకర్తలతో కలసి విజయవాడ పయనం

నరసరావుపేట: విజయవాడ వరద బాధితుల కోసం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు రూ.10లక్షల విలువైన నిత్యావసర వస్తువులు, 50 క్వింటాళ్ల బియ్యం, వంటనూనెలు, కందిపప్పు, దుప్పట్లు, చీరెలు అందజేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మంగళవారం అందజేసిన సహాయాన్ని రెండు వాహనాల్లో విజయవాడకు తీసుకెళ్లారు. పార్టీ కార్యాలయం వద్ద ఆ రెండు వాహనాలకు పచ్చజెండా ఊపి వాటితో కలిసి తాను కూడా బయలుదేరి వెళ్లారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదలలో విజయవాడ నగరం అతలాకుతలమైందన్నారు. ఆహారం లేక ఉండటానికి తావులేక అనేకమంది ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విపత్తును దృష్టిలో పెట్టుకొని సెప్టెంబర్ 12వ తేదీన నా జన్మదినోత్సవ వేడుకలు రద్దు చేసుకొని వరద బాధితులకు సహాయం చేద్దామని పిలుపు ఇచ్చామన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్పందించారని చెప్పారు. సుమారు పది లక్షల రూపాయలకు సరిపడా నిత్యావసర వస్తువులతో పాటు ఏడు రకాల వస్తువులను రెండు వాహనాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయవాడకు బయలుదేరుతున్నామన్నారు. విజయవాడలోని వన్ టౌన్ పరిధిలో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, టూటౌన్ పరిధిలో మల్లాది విష్ణు సహకారంతో ఎవరికైతే సహాయం అందలేదో, వారికి స్వయంగా మా చేతుల మీద అందజేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద బాధితులు చేసిన సమయంలో మేము ఉడతా భక్తి సహాయంగా భావిస్తూ వారి అడుగుజాడల్లో నడుస్తామన్నారు. మరొక్కసారి ఈ కార్యక్రమానికి సహాయం చేసిన ప్రతి ఒక్క దాతకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేశారు.



నిత్యావసరాల వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

క్లుప్తంగా

రేషన్ దుకాణాల పునర్విభజన ప్రక్రియకు శ్రీకారం

30 నాటికి సమగ్ర సమాచారం పంపాలని జేసీ ఆదేశం

నరసరావుపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థలోని చౌకదుకాణాల పునర్విభజన ప్రక్రియపై ఈనెల 30 నాటికి సమగ్ర సమాచారం పంపాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 6,45,110 రేషన్ కార్డులు ఉండగా 1289 చౌకదుకాణాల ద్వారా 18,36,475 మందికి ప్రతినెలా నిత్యావసరాలు పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లాలో 800 రేషన్ కార్డులు కంటే ఎక్కువగా ఉన్న దుకాణాలను పునర్విభజన చేయటం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 400 నుంచి 450 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 500 నుంచి 550 కార్డులు ఉండేలా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. 800 కంటే ఎక్కువగా కార్డులు ఉన్న దుకాణాలను అధికారులు గుర్తిస్తున్నారన్నారు. వీటి పరిధిలో సరుకుల పంపిణీ జాప్యం జరుగుతుందన్నారు. పునర్విభజన ప్రక్రియకు చెందిన షెడ్యూలు విడుదల చేయటం జరిగిందన్నారు. ఈనెల 30 నుంచి నవంబరు 23వ తేదీకల్లా వివిధ తేదీల్లో రాతపరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూ, అభ్యర్థుల ఖరారు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఆథరైజేషన్ జారీలతో నూతన దుకాణాలను ఏర్పాటుచేసి ఈ పోస్ పరికరాలు సరఫరా, మ్యాపింగ్ పూర్తి చేస్తారన్నారు.

శివాలయం అభివృద్ధికి చర్యలు



పెదకాకాని: భక్తులు, దాతల సహకారంతో శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఉప కమిషనర్ జీవీడీఎన్ లీలాకుమార్ అన్నారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన ఉప కమిషనరుగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఉప కమిషనరు, ఉప కార్య నిర్వహణాధికారిగా లీలాకుమార్ వ్యవహరించారు. మంగళవారం ఆయనకు దేవస్థాన అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజలో ఆయన పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాంకేతికతతో వ్యవసాయం లాభసాటి

యల్లమందలో 'పొలం పిలుస్తోంది'



యల్లమందలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఏవో మురళి

నరసరావుపేటరూరల్: వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని యల్లమంద గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా వ్యవసాయంలో ఉన్న రైతులే గొప్ప శాస్త్రవేత్తలని తెలిపారు. వ్యవసాయం చేయడం అంటే అంత సులువైన పని కాదని, శాస్త్రీయంగా, అంకితభావంతో చేయాల్సి ఉంటుందని తెలిపారు. వ్యవసాయం అంటే సైన్స్ అని అన్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో రైతులకు వీటిపై మంచి అవగాహన ఉందన్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులను చైతన్యవంతులను చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారులు, సిబ్బంది సలహాలను పాటించాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ గతంలో సులభతర వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించేవారని తెలిపారు. పెరిగిన పెట్టుబడి వ్యయం తగ్గిన దిగుబడులతో రైతులు వ్యవసాయం అంటేనే భయపడుతున్నారని తెలిపారు. రైతుల్లో ఆత్మస్థైర్యం నింపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగుమందులను సబ్సిడీపై రైతులకు అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామంలోని పత్తి పంటను జిల్లా అధికారులు పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లాం శాస్త్రవేత్తలు డయానా, డాట్ సైంటిస్ట్ ఎం.వెంకటరాములు, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి అమలకుమారి, ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల ఉల్లంఘనపై ఆగ్రహం

- గురుకుల పాఠశాలను సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- గడువు దాటిన ఆహారపదార్థాల వడ్డనపై మండిపాటు



గడువు దాటిన రాగిపిండి ప్యాకెట్లు చూపుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

నాదెండ్ల: యడ్లపాడు మండలం వంకాయలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలల హక్కులకు ఉపాధ్యాయులు భంగం కలిగిస్తున్నారని, వారిపై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. సోమవారం పాఠశాల నుంచి 67 మంది విద్యార్థులు గోడదూకి పారిపోయిన సంఘటన సంచలనం రేపిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఆమె స్థానిక అధికారులతో కలిసి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం విద్యార్థులకు ఇస్తున్న రాగిజావ వాసన వస్తుండటంతో రాగిపిండి ప్యాకెట్లు పరిశీలించారు. గడువు తీరిపోయిన రాగి పిండి ప్యాకెట్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటితో ఆహారం వడ్డిస్తే విద్యార్థులకు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని మండిపడ్డారు. పరిశుభ్రమైన తాగునీరు సైతం అందుబాటులో లేదని, సరైన ఆహారం అందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో లెట్రిన్‌లు కడిగించటం వారి హక్కులకు భంగం కలిగించినట్లేనన్నారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరులో ప్రిన్సిపల్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. క్రీడాసమయాల్లో తమను ఆటలాడించకుండా పీఈటీ తీవ్రంగా కొడుతున్నాడంటూ విద్యార్థులు చెప్పటంతో పీఈటీ తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఒక వారం రోజులపాటు స్థానిక అధికారులు పాఠశాలను తరచూ సంప్రదించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హేమలత, ఎంఈవో నాగరత్నం, సీడీపీవో శాంతకుమారి, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి

అమరావతి :రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమరావతిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం పలు ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలువేసి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నాయకుడు తోకల సూరిబాబు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలను చించి అవమానపరిచిన రఘురామకృష్ణంరాజు శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేసి అరెస్టు చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అవమానాలకే గురవుతున్న నేపథ్యంలో పాలక ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం నాయకుడు దారా ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ని అవహేళన చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. దళిత ప్రజా సంఘాల సభ్యులు పౌలు, నాగయ్య, ఎస్‌డీ మొహిద్దీన్, చిన్న బూసి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు వేగంగా రుణాలివ్వాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలకు వేగంగా రుణాలివ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక ప్రణాళికలో భాగంగా తొలి త్రైమాసికంలో ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు కేటాయించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, అకాల వరద కారణంగా అన్ని రంగాలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని కోరారు. పరిహారం మంజూరు చేయడానికి సిద్ధం చేసిన ప్రభుత్వ జాబితాను బ్యాంకర్లు కూడా ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. కౌలు రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో ఆమోదించిన దరఖాస్తులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులకు రుణాలకు త్వరగా మంజూరు చేయాలని సూచించారు. డీసీసీ కన్వీనర్ ఎస్.జవహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

తాడేపల్లి రూరల్: దిగువ కృష్ణానదిలోని కనకదుర్గ వారధి సమీపంలో మృతదేహం ఉందని తాడేపల్లి పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలోని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె వివరాలు గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు కనిపించలేదు. వయస్సు 45–50 సంవత్సరాలు ఉండవచ్చని, ఆచూకీ తెలిసిన వారు 08645 272186కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు కేలం రామకృష్ణ

నకరికల్లు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన కేలం రామకృష్ణ(41) పిడుగురాళ్లలోని గోతాల మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. ఈనెల 23వ తేదీన పనికోసం పిడుగురాళ్లకు వెళ్లి తిరిగి మంగళవారం తెల్లవారుజామున నకరికల్లు వచ్చి బస్టాండ్ సెంటర్‌లో దిగాడు. రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సత్యవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

హైదరాబాద్‌లో ఘటన



సామినేని రాఘవయ్య



ఇడుపులపాటి సురేష్

నాదెండ్ల: యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కారును ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన ఇడుపులపాటి సురేష్ (42) సామినేని రాఘవయ్య (44) మృతి చెందారు తెలంగాణలోని మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి పరిధిలోని ఘట్‌కేసర్ జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారును ట్యాంకర్ ఢీకొంది. ఇరువురూ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న మరో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన మోత రమేష్, కాకుమాను బుల్లెయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రాజకీయాల్లో ఆణిముత్యం సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పిస్తున్న నేతలు

లక్ష్మీపురం: దేశ రాజకీయాల్లో ఎత్తిన ఎర్ర జెండాను దించకుండా ప్రజా సమస్యలపై పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. సభకు నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంపాదన కోసమే రాజకీయాల్లోకి వస్తున్న నేతలు ఉన్న ఈ రోజుల్లో జీవితాంతం నిరాడంబరంగా ప్రజల కోసం పోరాడిన ఏచూరి లాంటి ఆణిముత్యాలు అత్యంత అరుదు అన్నారు. లౌకికవాద శక్తులను కూడగట్టడంలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ.. భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. కామన్ మినిమం ప్రోగ్రాం రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించారని పేర్కొన్నారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల పరిరక్షణ, ఆర్‌టీఐ, ఆహార భద్రత, విద్యాహక్కు చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, విరసం అధ్యక్షుడు సీఎస్ఆర్ ప్రసాద్, ప్రజాగాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల నాడు అలిగి వెళ్లాడు

- నాడు భార్యాభర్తల మధ్య వివాదం
- నేడు కేసును ఛేదించిన పోలీసులు
- తల్లికి అప్పగింత!



దేవదానం ఆచూకీ కనుగొని తల్లి మనోహరికి అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్

నరసరావుపేటటౌన్: అదృశ్యమైన వ్యక్తి కేసును పోలీసులు ఛేదించారు. భార్య మీద కోపంతో ఇంటి నుంచి వెళ్లిన భర్త ఆచూకీ కనుగొని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏడేళ్ల కిందట నమోదైన కేసుకు తెరబడినట్లు అయ్యింది. నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన కల్వకురి జోసెఫ్ దేవదానంకు అదే ప్రాంతానికి చెందిన షైని సిల్వతో 2011లో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో 2017లో ఎవరికీ చెప్పకుండా దేవదానం ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఈ మేరకు భార్య ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి నుంచి దేవదానం కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసుపై ప్రత్యేక దృష్టి సారించిన వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్, దేవదానం స్నేహితులను విచారించారు. ఇటీవల కాలంలో స్నేహితుడికి ఫోన్ చేసినట్లు తెలుసుకొని ఫోన్ నెంబరు ఆధారంగా విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా దేవదానం హైదరాబాద్‌లో ఉన్నాడని తెలుసుకున్నారు. సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు వెళ్లి దేవదానంను పట్టణానికి తీసుకొచ్చారు. భార్య, భర్తల మధ్య ఇంకా వివాదం అలానే ఉండటంతో దేవాదానంను తల్లి జెస్సీ మనోహరికి సీఐ అప్పగించారు. దీంతో ఏడేళ్ల కిందట నమోదైన అదృశ్యం కేసు సుఖాంతమైంది.

పడిగాపులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు



మాట్లాడుతున్న భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు

సత్తెనపల్లి: ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అడ్డాల వద్ద పడికాపులు కాయాల్సి వస్తుందని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లాలో ఆన్‌లైన్ బుకింగ్ చూపించకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఇళ్ల యజమానులకు అందడం లేదన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా ఇచ్చిన సమయం అరగంటలో ఆన్‌లైన్ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు మాత్రమే చేసుకోగలుగుతున్నారని, ఆన్‌లైన్ పరిజ్ఞానం లేని సామాన్యులకు ఇసుక దొరకడం లేదన్నారు. ఆన్‌లైన్ చేసుకుందామని సెంటర్‌కు వెళితే ఆ కంప్యూటర్‌లో పల్నాడు జిల్లా చూపటం లేదని, నెల్లూరు, కర్నూలు జిల్లాలు మాత్రమే చూపిస్తున్నదన్నారు. ఆ జిల్లాల నుంచి బుకింగ్ చేసుకొని ఇసుకను పల్నాడు జిల్లాకు తెచ్చుకోవాలంటే (4 టన్నుల) ట్రక్ ఇసుక రూ.10వేల నుంచి రూ.12 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక ఊసే లేదన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని ఇసుక డంపింగ్ యార్డులను పుష్కలంగా ఇసుకతో నింపి పల్నాడు జిల్లాను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఆన్‌లైన్ బుకింగ్‌ను సరళతరం చేసి ఇసుకను సరఫరా చేయాలని, తద్వారా భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు మొగల్ ఆదాంషా, కార్యదర్శి గొట్టిపాటి సాల్మన్ రాజులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గేదెల దొంగలు

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన పి.గుడిపాడు గ్రామస్తులు
- కొరిశపాడు మండలంలో 20కి పైగా గేదెల అపహరణ
- పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగిన బాధితులు



కొరిశపాడు పోలీసు స్టేషన్‌వద్ద బాధితులతో మాట్లాడుతున్న కొరిశపాడు ఎస్ఐ సురేష్

మేదరమెట్ల: గత కొంతకాలం నుంచి గేదెలను దొంగిలించుకుపోతున్న ముఠాలో కొంతమందిని సోమవారం అర్ధరాత్రి కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి కొరిశపాడు పోలీసులకు అప్పగించారు. వీరు గత కొంతకాంగా మండలంలోని బొడ్డువానిపాలెం, కొరిశపాడు, అనమనమూరు, మేదరమెట్ల, పి.గుడిపాడు గ్రామాల్లో 20 వరకు గేదెలను అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. ఎప్పటిలాగే గేదెలను దొంగిలించేందుకు అర్ధరాత్రి దాటిన తరువాత పి.గుడిపాడు గ్రామానికి వెళ్లారు. ఇద్దరు దొంగలు నేరుగా గేదె వద్దకు వెళ్లి గొలుసును కట్ చేసి గేదె, దూడతో అక్కడ నుంచి వెళ్లగా, మరో ముగ్గురు దూరంగా ఆటోను పెట్టుకొని ఉన్నారు. అదేసమయంలో గేదెల యజమాని గేదెకు మేత వేసేందుకు వచ్చింది. అప్పటికే గేదెకు ఉన్న గొలుసు కట్‌చేసి ఉండటం, గేదేతోపాటు దూడ కూడా లేకపోవడంతో ఇరుగుపొరుగు వారిని లేపి దొంగలు వచ్చారనే సమాచారం తెలపడంతో ఇరుగుపొరుగు వారంతా కలసి నాలుగు దిక్కులకు పోయి వెతకడం మొదలు పెట్టారు. అటుగా వెళ్తున్న స్థానికులకు రోడ్డుపై ఆటోను పెట్టుకొని తచ్చాడుతున్న వ్యక్తులు ఎదురయ్యారు. కంగారుపడుతున్న వారిని గమనించిన కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో ఆటోతో పాటు వ్యక్తి ఫొటో తీశారు. దీంతో బయపడిన వ్యక్తులు ఆటోతో పారిపోవాలని చూడటంతో స్థానికులు పట్టుకొని గ్రామానికి తీసుకెళ్లి దేహశుద్ధి చేశారు. ఇదంతా దూరం నుంచి చూసిన మిగతా దొంగలు గేదె, దూడను వదిలేసి పారిపోయారు. గ్రామస్తులు పట్టుకున్న వారిని కొరిశపాడు పోలీసులకు అప్పగించారు.

బాధితుల ధర్నా..

వారం రోజుల కిందట ఇదే గ్రామంలో రూ.లక్ష విలువైన గేదె దొంగతనానికి గురయింది. గేదెల దొంగలు పోలీసు స్టేషన్‌లో ఉన్నారన్న సమాచారం తెలుసుకున్న కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల బాధితులతోపాటు పలు మండలాలకు చెందిన సుమారు 50 మంది బాధితులు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. కూలీనాలీ చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న తమలాంటి వారినుంచి గేదెలను దొంగిలించుకుపోయారని, తమకు న్యాయం చేయాలంటూ మేదరమెట్ల సెంటర్‌లో ధర్నా నిర్వహించి రహదారికి అడ్డంగా వాహనాలు ఉంచి నిరసన తెలిపారు. దీంతో ఎస్ఐ సురేష్ బాధితులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. గేదెల దొంగతనం చేసిన వారిలో మేదరమెట్ల, అనమనమూరు గ్రామాలకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పోస్టులు భర్తీ చేసి పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న రాంబాబు

కొరిటెపాడు (గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని అఖిల భారత యూబీఐ అధికారుల ఫెడరేషన్ ప్రాంతీయ కార్యదర్శి మాదాల రాంబాబు డిమాండ్ చేశారు. యూబీఐ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్‌తోపాటు అఖిల భారత యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులపై పని భారం తగ్గించాలన్నారు. విష సంస్కృతిని మేనేజ్‌మెంట్ విడనాడాలని కోరారు. ఇన్సూరెన్స్, ఇతర పథకాలపై దృష్టి తగ్గించి బ్యాంకింగ్ వ్యాపారంపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు, సదుపాయాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా జారీ చేసిన అప్రెంటీస్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. అసోసియేషన్ నాయకులు కళ్యాణ్, బాషా, క్రాంతి, వేణుబాబు, యూబీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధర రావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వి.దివ్య తేజోమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నైపుణ్యం, జీవన విధానం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రత్యేక అతిథి వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, బాల్యవివాహాలు నిర్మూలన, వితంతువులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్నామని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాల్సిన బాధ్యత ప్రోగ్రామ్ ఆఫీసర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్ధయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి.శ్రీనివాసరావు, రవికుమార్, డాక్టర్ కె.సృజన, పి.యుగంధర్‌రెడ్డి, సీహెచ్ ఉమాశంకర్, కె.వి.నిరుపమ, సీహెచ్. పుణ్యశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల నిర్వహణకు వసతులు ఉన్నాయని గుర్తుచేశారు. క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో కాంస్య పతకం సాధించడంతోపాటు ప్యారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం విద్యార్థిని వై.జ్యోతికి రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన క్రీడా అధ్యాపకులను సన్మానించారు.